# వెన్నెల విరిసే దెప్పుడు?

గుడిసేవ సుందరరామయ్య



విజయవాడ స్టేషన్లో రైలాగింది!

స్లీపర్ కోచ్‌లోంచి క్రిందికి దిగాడు ఆనంద్. చేతిలో వున్న సూట్ కేసును క్రింద పెట్టి తన చిన్ననాటిమిత్రుని రూపాన్ని గుర్తుతెచ్చుకొంటూ చుట్టూ పరికించిచూశాడు.

కంపార్ట్‌మెంట్స్‌లోకి పరీక్షగా చూస్తూ ముందుకు నడుస్తున్న ఓ యువకుని చూడగానే "మధూ!" అంటూ గట్టిగా కేకేశాడు. ఆయువకుడు వెనక్కి తిరిగి చూశాడు

గుర్తు పట్టడానికి వీల్లేనంతగా మారిపోయిన స్నేహితునివైపు కొన్ని క్షణాలపాటు ఆశ్చర్యంగా చూసి వెంటనే ఉత్సాహంగా ముందుకు వచ్చి ఆనంద్‌ను కౌగలించుకొన్నాడు మధు.

"నేను నిన్ను గుర్తుపట్ట లేనేమోనని భయపడ్డానురా! అయినా వెంటనే గుర్తు పట్టేశాను! కారణం ఏమిటో తెల్సా, నీవు శారీరకంగా ఎక్కువగా మారకపోవటమే!" అంటూ నవ్వేశాడు ఆనంద్.

"నిజంగానా!" మిత్రుని కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"ష్యూర్! ష్యూర్! ఆనాటి మామిడికాయల దొంగ మధుగాడికి ఈ నాటి మధుసూదనరావు గారికి నాకేమీ తేడా కన్పించటంలేదు." అన్నాడు ఆనంద్ పరిహాసంగా.

"నీ కింకా ఆ దృశ్యాలన్నీ గుర్తున్నాయన్నమాట!" అన్నాడు మధు తనుకూడా నవ్వేస్తూ.

మధు ప్రక్కనే మరొకవ్యక్తి వున్నాడని గ్రహించి" వారెవ్వరు!" అని అడిగాడు ఆనంద్.

"ఓ... సారీ! చెప్పటం మర్చాను. ఇతను మా కొలీగ్ రాజు" అంటూ పరిచయంచేశాడు.

"గ్లాడ్ టు మీట్‌యు! మైనేమ్ ఈజ్ ఆనంద్! కమింగ్ ఫ్రమ్ రంగూన్!" అంటూ తనను తాను పరిచయం చేసుకొంటూ రాజుతో కరచాలనం చేశాడు.

"మీ గురించి మధు చెప్పాడు!" అంటూ ఆనంద్ చేతిని అందుకొన్నాడురాజు.

కబుర్లు చెప్పుకొంటూ ముగ్గురూ మెల్లగా మెట్లెక్కి ఓవర్ బ్రిడ్జిమీదికి వచ్చారు.

ఒకే బ్రిడ్జిమీద రెండుదార్లుగా విభజన చేయటానికి ఉపయోగించిన 'ఐరన్ మెష్' వెలుగు నీడల మధ్య దేవుడు గీసిన సరిహద్దు గీతలా కన్పిస్తూంది!

తనకంటికి కొత్తదనాన్ని సంతరించుకొన్నట్లు కన్పిస్తున్న విజయవాడ స్టేషన్‌ను వింతగా చూస్తూనడుస్తున్నాడు ఆనంద్.

"నాకోవింత సందేహంవుంది. తీరుస్తారా!" అని చనువుగా అడిగిన రాజువైపు ఏమిటన్నట్లు చూశాడు.

"ఆఁ...మరేంలేదు! మీరు వచ్చిన దగ్గర్నుంచి గమనిస్తున్నాను! మీరు అచ్చంగా మా ఆంధ్రుల్లానే మాట్లాడుతున్నారే!"

"మరి నేనుకూడా ఆంధ్రుణ్ణే కదండీ!" నవ్వేడు ఆనంద్.

రాజు, మధుకూడా నవ్వేశారు.

"అంటే ... నా వుద్దేశ్యం..."

అర్థమైంది! పరాయి దేశంలో వుంటూ కూడా తెలుగు మామూలుగా ఎట్లా మాట్లాడ గలుగుతున్నాననే కదా మీ అనుమానం, అసలు అప్పట్లో నాకి దేశం వదిలి వెళ్ళాలన్పించ లేదండి! కాని మా నాన్నగారు వ్యాపార నిమిత్తం మకాం అక్కడకు మార్చేసరికి ఎంతో బాధ పడ్తూ నా స్నేహితుల్ని, వ్వస్థలాన్ని వదిలి వెళ్ళాల్సి వచ్చింది. మేము రంగూన్ వెళ్ళినప్పటికీ మన ఆచార వ్యవహారాలను, సంస్కృతిని ఎన్నడూ మరువలేదు. మన భాషను అంతకన్నా మర్చిపోలేదు. తెలుగు సాహిత్యంపై అభిరుచిని పెంచుకుని ఎన్నోమంచి పుస్తకాలను చదవటానికి ప్రయత్నించాను. అదీగాక రంగూన్‌లో మన ఆంధ్రులు చాలామంది వున్నారు. ఆ పరిస్థితుల్లో మన మాతృభాషను ఎలా మర్చిపోగలను చెప్పండి, మళ్ళీ మావాడి పెళ్ళి ధర్మమా అని నా స్వస్థలాన్ని చూసే అదృష్టం కలిగింది" అంటూ మధు భుజంమ్మీద ఆప్యాయంగా తట్టాడు.

అప్రయత్నంగా ఆనంద్ దృష్టి 'ఐరన్ మె

# మీకు తెలుసా?

— నాదెళ్ళ లక్ష్మీదాసు

1. భారతదేశంలో మొట్టమొదటి పత్రిక ఆంగ్లంలో కలకత్తా నుండి వెలువడింది.

2. 1941 లో హైద్రాబాద్‌లో జనాభా 7,29,000 మంది మాత్రమే

3. అచ్చుపని కనుగొన్నది చైనా దేశస్థులు.

4. ప్రపంచంలోని జనాభా 1940-41 లెక్కల ప్రకారం 216,98,68,000 మంది.

5. భూమికి సూర్యునికి మధ్య దూరం 94,452 వేల మైళ్ళు.

6. ప్రపంచంలోకెల్ల పెద్ద సరస్సు ఉత్తర అమెరికాలోని 'సుపీరియర్'.

7. కనుచూపు మేర అంటే మనం భూమినుండి 50 అడుగుల ఎత్తు నుండి చూస్తే మనకు 9.3 మైళ్ళు కనపడుతుంది. అలాగే 100 అడుగుల ఎత్తునుండి చూస్తే కనపడే దూరం 13,2 మైళ్ళు.

8. ప్రపంచంలో కెల్లా ఎత్తైన శిఖరం ఎవరెస్టు. ఇది ఇండియాలో ఉంది. దీని ఎత్తు 29, 141 అడుగులు.

9. ఇండియాలో మొదటి రైలు మార్గం 1853 లో వేయబడింది.

10. ఫొటోగ్రఫీ కనుగొన్నది ఫ్రాన్స్ దేశస్థులు.

11. సాయం సమయంలో ఎండలో నిలబడితే మన శరీరంలో 'డి' విటమిను ఉత్పత్తి అవుతుంది.

12. సినిమా మెషిన్ కనుగొన్నది అమెరికావారు 1894 సం.లో.

---

అవతలకు వెళ్ళింది.

ఓ నిర్భాగ్యుని ఆకారం —

కట్టుకోడానికి గుడ్డకూడా కరువైన మానవుడు. ఎముకలను కొరికే చలిలో దిక్కు లేకుండా పడున్న శరీరం.

ఆనంద్ క్షణంపాటు ఆగిపోయాడు.

అతని హృదయంలో జాలి తొంగిచూసింది.

అగ్నికి ఆజ్యం తోడైనట్లు ఆకలి బాధకు చలి బాధ తోడైంది ఆ జీవికి.

ఫలితంగా హృదయ విదారకమైన మూల్గు.

ఆనంద్ ఇంకొంచెం ముందుకెళ్ళాడు.

పరీక్షగా పరిసరాలను పరికించాడు.

దాని ప్రక్కగా ముడుచుకు పండుకొన్న ముసలివాడు కనిపించాడు. ఎముకల గూడులా వున్న వాడి శరీరాన్ని చూస్తే వాడు ఇంకా ఎంతో కాలం బ్రతకడనిపిస్తుంది.

వాడికి కొంచెం దూరంగా —

సంస్కారహీనమైన జడలు కట్టిన జుట్టు.

మాసి, పేలికలైన బట్టలు.

జుగుప్సను కలిగించే మరో రూపం.

ఆ దృశ్యాలను చూస్తుంటే ఆనంద్ ముఖంలో రంగులు మారాయి. అతనిలోని మార్పును మధు వెంటనే పసిగట్టగల్గాడు.

ఆనంద్ మనస్సు వెన్నకంటె సున్నితమని, కష్టాల్లో వున్నవాళ్ళను చూస్తే అతని హృదయం బాధపడుతుందని తెలుసు! అందుకనే ప్రసంగాన్ని మార్చటానికి ప్రయత్నిస్తూ, "నీ వ్యాపారం బాగా నడుస్తుందా?" అని అడిగాడు.

"నా వ్యాపారానికేం బాగానేవుంది. అలాచూడు పాపం! వాళ్ళెలా బాధ పడ్తున్నారో" అంటూ ఆ నిర్భాగ్యుల్ని చూపించాడు.

"మనం వూహించుకున్నంత బాధ వాళ్ళకుండదు. ఎప్పట్నుంచో అలాంటి జీవితాలకు అలవాటు పడిపోయారు." అతి సామాన్య విషయమన్నట్టు చెప్పాడు రాజు.

"అయితే ప్రతిరోజూ వాళ్ళలా బాధపడాల్సిందేనా?" అమాయకంగా అడిగాడు ఆనంద్.

"భలేవాడవండీ! వాళ్ళేననుకున్నారా! అలాంటి అభాగ్యులు ఈ ప్రిడ్డీ రోడ్డపునావున్నారు!" అన్నాడు రాజు.

"ఛీ! ఛీ!" అని గొణిగాడు ఆనంద్.

ఆనంద్ మనస్సు ఆలోచనలతో నిండిపోయింది.

"అపాదమస్తకం శరీరాన్ని పూర్తిగా కప్పుకొన్నా చలిబాధను భరించలేక ఇంకా ఏవేవో సుఖాలను కోరుకునే వారు కొందరుంటే చూసే వారికి జాలిని కల్గిస్తూ దుర్భరమైన జీవితాన్ని గడుపుతూ చలిలో బాధపడే నిర్భాగ్యులు మరి కొందరు.

అందరూ మానవులే!

అందరి శరీరాలు రక్తమాంస నిర్మితాలే!

మరయితే ఈ విభేదం ఎందుకు!

సుఖదుఃఖాలు —

వెలుగునీడలు —

పగలు రాత్రి —

అధికారం, బానిసత్వం —

కలవాళ్ళు, లేనివాళ్ళు

యీ భేదాలు సృష్టిఅంతమయ్యే వరకువుండాల్సిందేనా?"

స్టేషన్ బయటకు వచ్చాక మధు రిక్షాను పిల్చాడు. రాజు ఇద్దరి వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. మిత్రులిద్దరూ కూర్చున్నాక రిక్షా కదిలింది.

* *

మధు వాళ్ళ ఇల్లంతా బంధువులతో సందడిగా వుంది. మేడ క్రిందభాగంలో మధును పెళ్ళికొడుకును చేసే ప్రయత్నంలో వున్నారు.

ఆనంద్ మాత్రం కాఫీ, టిఫిన్‌లు ముగించుకొని మేడపైన తన కోసం ప్రత్యేకంగా కేటాయించబడిన గదిలో కిటికీ ప్రక్కగా కుర్చీవేసుకొని కూర్చున్నాడు.

సిగరెట్ వెల్గించి రోడ్డుమీదికి దృష్టి మరల్చాడు. అకస్మాత్తుగా అతని కళ్ళకు ఓ దృశ్యం కన్పించేసరికి కాస్సేపు పరిశీలనగా అలా చూస్తూండిపోయాడు

నల్గురైదుగురు వ్యక్తులు వింత వింత ధ్వనులను పుట్టించే చెక్క వాయిద్యాలను వాయించుకొంటూ మధ్య మధ్య చేతుల్లో వున్న డబ్బాలను మోగిస్తూ రోడ్డుమీద నడిచే జనం దగ్గర అడుక్కుంటున్నారు. అసహ్యం జుగుప్సను కల్గించే వాళ్ళ శరీరాలను చూసి జనం సాధ్యమైనంత

దూరంగా పోవటానికి ప్రయత్నిస్తున్నారు. కాని వీళ్ళుమాత్రం వాళ్ళకు సాధ్యమైనంత సమీపంగా చేరటానికి ప్రయత్నిస్తున్నారు. నడుస్తున్న వాళ్ళ దారికి అడ్డుపడి వాళ్ళముఖాలకు దగ్గరగా డబ్బాలు పెట్టి "బాబూ! బాబూ!" అంటూ అడుక్కొంటున్నారు.

'వీళ్ళ జబ్బు ఎక్కడ అంటుకొంటుందో! ఎందుకొచ్చిన పీడ!' అనే భయంతోనైనా చిల్లర డబ్బులు పడేస్తారని వాళ్ళ ఆశ. ఒక ప్రక్క చీము, నెత్తురు కారుతూ ఘోరమైన వ్యాధిని అనుభవిస్తూనే వేరొక ప్రక్క చారెడు గింజల కోసం వాళ్ళు పడుతున్న తాపత్రయానికి ఆనంద్ జాలిపడ్డాడు.

'మీ వీధులను మురికి చేయరాదు! ఆరోగ్యమే మహాభాగ్యం' అనే అక్షరాలను ముచ్చటగా మీద రాయించుకొన్న లారీ ఒకటి వాళ్ళ ప్రక్కనుంచే వెళ్ళిపోయింది.

మ్యునిసిపాలిటీవారి వాహనం వెళ్ళిన దిక్కే చూస్తూండి పోయిన ఆనంద్ దృష్టి ఓ దుకాణం ముందు నిల్చొన్న 'క్యూ' మీద పడింది.

వాళ్ళ చేతుల్లోవున్న ఖాళీ పాత్రలు, సంచులు వారలా నిల్చోటానికి గల కారణాన్ని తెల్పుతున్నాయి.

ఆ 'క్యూ' ప్రక్కనుంచే విందురూ లాలిలాంటి ఓ 'బియ్యంపు లారీ' దుమ్ము రేపుకొంటూ ముందుకు పోయింది.

'క్యూ'లో కొంతమంది దానివైపు నిరాశతో చూశారు. పరాయి ప్రాంతాలకు బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నాననే విజయ గర్వంతో కాబోలు ఆ లారీ ఎవర్నీ గమనించకుండానే వెళ్ళిపోయింది.

రోడుమీద కన్పించిన దృశ్యాలతో ఆనంద్ తల వేడెక్కిపోయింది.

మెల్లిగా వరండాలోకి వచ్చాడు.

కాని అక్కడకూడా అతనికి ప్రశాంతత దొరకలేదు.

మధు వాళ్ళ ఇంటిముందు 'ధర్మము బాబూ!' అంటూ అరుస్తున్న బిచ్చగాడొకడు కన్పించాడు. అంతలోనే వాళ్ళింటిముందు ఓ రిక్షావచ్చి ఆగింది. అందులోంచి ఓ మధ్య వయస్కురాలు అయిదేళ్ళ పాపతో పాటు క్రిందికి దిగింది. వాళ్ళను 'రిసీవ్' చేసుకోటానికి మధు వాళ్ళమ్మ బయట కొచ్చింది. ఎదురుగా గుమ్మంముందు కన్పించిన బిచ్చగాణ్ణి చూడగానే ఆమె కోపంతో వూగిపోయింది.

"ఏరా! నీ వింకా ఇక్కడే తగలడ్డావా! ఎన్నిసార్లు చెప్పాలిరా పొమ్మని!"

"ఆకలిగా వుంది తల్లీ!" దీనంగా చూశాడు.

"ఇప్పుడెవరికీ తీరికగా లేదు! గుమ్మాని కడ్డంగా లే!" అంటూ కసురుకొంది.

బిచ్చగాడు నిరాశగా వెళ్ళిపోయాడు.

వచ్చిన బంధువుల్ని మేడమీదికి తీసుకు వస్తున్న మధు తల్లిని చూడగానే వరండాలో నిల్చున్న ఆనంద్ కొంచెం ప్రక్కకు తప్పుకొన్నాడు.

"ఏమ్మా వదినా, మీ కోడళ్ళిద్దర్నీ తీసుకు రాకుండా చిట్టిదాన్ని ఒక్కర్తెనే వెంటేసు కొచ్చావా? అన్నయ్యగారు రాలేదే, అప్పట్లు మీ పెద్దమ్మాయి కూడా ఇక్కడే వుందటగా! దాన్నికూడా తీసుకురాలేకపోయావా?" ప్రశ్నల వర్షాన్నికురిపిస్తూ బంధువుల్ని హాల్లోకి తీసికెళ్ళింది మధు తల్లి.

ఆనంద్ ఆశ్చర్యపోయాడు.

ఇందాక మునుపే కడుపు కాలుందని కాళ్ళా వేళ్ళా పడిన బిచ్చగానికి బిచ్చం వేయటానికే తీరిక లేనట్లు మాట్లాడిందావిడ. మరి ఇప్పుడు ఎంతమందికైనా ఆతిథ్యం ఇచ్చే శక్తి, తీరిక తనకున్నట్లు మాట్లాడుతుందేమిటి!

మానవ నైజం ఎంత విచిత్రం!

చేతిలో వున్న సిగరెట్‌ను బయటకు విసిరి తన గదిలోకి వెళ్ళిపోయాడు ఆనంద్.

* * *

రంగు రంగుల విద్యుద్దీపాల తోరణాలతో కనకదుర్గమ్మ గుడి కమనీయంగా కన్పిస్తూంది.

కొండమీదికి కన్పిస్తున్న పట్టణ సౌందర్యాన్ని ఆసక్తిగా తిలకించాడు ఆనంద్. పెద్ద వ్యాపార సంస్థగా, రైల్వే కూడలిగా ప్రసిద్ధికెక్కిన ఆ పారిశ్రామిక వాడ వెలుగు నీడలమధ్య వింతగా గోచరిస్తుంటే ఆనంద్ అంతరంగం పులకరించింది. శోభాయమానంగా విలసిల్లుతున్న ఆ నగరంలో కూడా హృదయ విదారకమైన జీవితాలనుఅనుభవించే నిర్భాగ్యులున్నారన్నవిషయం గుర్తుకురాగానే అతని హృదయం చివుక్కుమంది. వెలుగు నాశ్రయించే నీడలా పగలుకోసం ఎదురుచూసే రాత్రిలా సిరిసంపదలను దరిద్రం కూడా అంటిపెట్టుకొనే వుంటుందన్న నగ్న సత్యాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడతను.

"హలో! మీరిక్కడున్నారా!" అంటూ అక్షింతలను తెచ్చి ఆనంద్ చేతిలో పెట్టాడు రాజు.

"థాంక్స్" అంటూ అందుకొన్నాడు.

"మండపం దగ్గరకు వెళ్దాం రండి! మన వాడు మూడు ముళ్ళు వేయటానికి సిద్ధంగా వున్నాడు!" అంటూ నవ్వుతూ ముందుకు నడిచాడు రాజు.

మంగళవాయిద్యాల మ్రోతలో -

బంధుమిత్రుల ఆశీర్వచనాల అక్షింతలతో -

ఫ్లాష్ కెమారా వెలుగులో -

'నేనూ ఓ ఇంటి వాణ్ణయ్యాను!' అన్పించుకొన్నాడు మధు. తను తీసుకు వచ్చిన ప్రజంటేషను మధుకు అందజేసి మండపంలోంచి బయటకొచ్చాడు ఆనంద్.

మధుకి విముక్తి లభించటానికి ఇంకా కొంతకాలం పడుతుందని ఊహించి మెల్లిగా స్వామివారి ఆలయంవైపు నడిచాడు. ఆ రోజు శుక్రవారం కావటంచేత భక్తుల సంఖ్య ఎక్కువగానే వుంది. స్వామి దర్శనం చేసుకొన్నాక సోడా త్రాగటానికి క్రిందికి బయలుదేరాడు. ఒక్కొక్కమెట్టే నెమ్మదిగా దిగాడు.

మెట్లకిరుప్రక్కలా...

బిచ్చగాళ్ళు!

వాళ్ళముందు మాసిపోయిన పాతగుడ్డలు—

దీనాతిదీనమైన అరుపులు—

అంతులేని అభ్యర్థనలు—

అనేక రకాల మనుష్యులు—

స్త్రీలు—

పురుషులు—

పిల్లలు—

చెవిటివాళ్ళు—

అవిటివాళ్ళు—

మూగవాళ్ళు—

ఆనంద్ మనస్సు వికలమైంది.

"వారి దుస్థితి కల్గటానికి కారణం ఏమిటి? యాచకవృత్తి వాళ్ళకు వంశపారంపర్యం కావల్సిందేనా?

వాళ్ళ జీవితాలకు మార్పులేదా?"

సోడా త్రాగటానికి వచ్చాననన్న విషయాన్నే మర్చిపోయి, బిచ్చగాళ్ళను గూర్చి ఆలోచిస్తూ వెను తిరిగి వెళ్ళిపోరిని కల్పుకోటానికి కొం



మీదికి వెళ్ళిపోయాడు ఆనంద్!

* * *

మధ్యాహ్నం పన్నెండు దాటింది.

అప్పటికింకా మేడక్రింద పంక్తి భోజనాలు జరుగుతూనేవున్నాయి. వచ్చిన బంధువులను పరామర్శిస్తూ మధు హడావుడిగా తిరుగుతున్నాడు.

అంతకుమునుపే భోజనాన్ని ముగించుకొన్న ఆనంద్ మేడమీద గదిలో కిటికీప్రక్కనే కుర్చీ వేసుకొని రోడ్డువైపు చూస్తూండిపోయాడు.

మునిసిపాలిటీ చెత్తకుండీకి కొంచెందూరంగా రెండు కుక్కలు లోకాలు ముడుచుకొని కూర్చున్న దృశ్యం అతనికి కన్పించింది. కుండీప్రక్కనే యిద్దరాడవాళ్ళు, ముగ్గురు పిల్లలు వున్నారు. వాళ్ళవేషాలు వారి ఆర్థికపరిస్థితిని వెల్లడి చేస్తున్నాయి! కుండీలో పడేసిన ఎంగిలి విస్తళ్ళలో తమకు కావాల్సిన పదార్థాలను ఏరుకొంటున్నారు. వాళ్ళు! తమ నోటిదగ్గర కూటిని తింటున్నారనే రోషంతో కాబోలు కుక్కలు ముందుకొచ్చి అరవబోతున్నాయి. వాటిని అదుపులో పెట్టడానికి అంతలోనే ఓ నల్లటి వ్యక్తి పరిగెత్తుకువచ్చాడు. చేతిలోవున్న కర్రతో ఆ కుక్కల్ని చావబాదాడు.

ఆ దృశ్యాన్ని చూశాక ఆనంద్ మనస్సులో ఆలోచనలు చెలరేగాయి.

"పాపం? కుక్కలు తినే అన్నానికి ఆశపడ్తున్నారు వాళ్ళు. అందుకు ఆ అభాగ్యులను అసహ్యించుకొని ప్రయోజనం లేదు! వాళ్ళాస్థితికి దిగజారడానికి కారణం క్షుద్బాధ! ఆ ఆకలి పిశాచాన్ని హతమార్చాలంటే ఆర్థిక బలం కావాలి. అంటే శారీరకంగా ఎంతో కష్టపడాలి; కాని అలవాటు పడిన వీళ్ళ శరీరాలు కష్టపడటానికి అంగీకరిస్తాయా? ఒకవేళ అంగీకరించినా వాళ్ళ కష్టాల్ని ఆదరించి ప్రతిఫలం చెల్లించే యజమానులు వుండాలిగా! అయితే వీళ్ళ సమస్యకు పరిష్కారం ఏమిటి?...

మధు పిలుస్తున్నాడని ఎవరో వచ్చి చెప్పగానే తన ఆలోచనలను కట్టిపెట్టి మేడదిగి క్రిందికి వెళ్ళాడు ఆనంద్.

* * *

"ఏమైనా నీ వింత త్వరగా వెళ్ళిపోవటం నాకేం నచ్చలేదు!" అన్నాడు మధు ఆనంద్ వెళ్ళే రోజున.

"డోంట్ థింక్ అదర్‌వైజ్! నాకే మాత్రం అవకాశం వున్నా ఓవారం రోజులపాటు ఇక్కడే వుండేవాణ్ణిరా! నీ లాంటి ప్రాణస్నేహితుని వదిలి వెళ్ళాలంటే నాకు మాత్రం ఆనందంగా వుంటుందా! కాని అక్కడ నాకు చాలా అర్జంటు పనులున్నాయి. అందుచేత వెంటనే బయలుదేరక తప్పటం లేదు." అంటూ ఆనంద్ ఓవర్ బ్రిడ్జి మీదకి దారి తీస్తోమెట్లెక్కాడు.

"బోనీ నీవు కూడా ఇక్కడకు వచ్చి సెటిల్ కాకూడదూ!" అని అడిగాడు మధు

"ఈ పరిస్థితుల్లోనా? ఇంపాజిబుల్! అయినా అప్పుడప్పుడు.నిన్ను చూడటానికి వస్తూనేవుంటా' న్లె అంటూ బ్రిడ్జిమీద అడుగు పెట్టాడు.

"నీ వెప్పుడూ అలానే అంటావ్!" అన్న మాటలు ఆనంద్‌కువిన్పించలేదు

అతని కళ్ళు ఎవరినో వెదకసాగాయి.

"ఐరన్ మెష్"లోంచి అవతల ప్రక్కకు చూశాడు.

హృదయవిదారకమైన దృశ్యం కన్పించింది,

ముఖమీద కప్పిన మాసిన గుడ్డ—

ప్రక్కనే పరచివున్న పాతగుడ్డ—

జాలిగుండెలను జ్ఞప్తికి చేస్తున్న చిల్లర పైసలు—

చెప్పలేక చెబుతున్నాయి. ఆ వ్యక్తికిక జీవం లేదని. ప్రక్కనుంచే తమక్కూడా ఆ దుస్థితే కలుగుతుందని భయపడి కాబోలు అతని కోవకు చెందిన మరికొందరు బిచ్చగాళ్ళు దూరంగా పండుకొన్నారు.

ఆనంద్ జేబులోంచి ఓ రూపాయినోటు తీసి పాతగుడ్డమీద పడేటట్టు విసిరాడు.

మిత్రులిద్దరూ ప్లాట్ ఫారమ్మీదికి వెళ్ళిన కాస్సేపటికి ట్రయిన్ వచ్చింది. వాళ్ళిద్దరూ హృదయాలను విప్పి మాట్లాడుకునేటంతవరకు ట్రయిన్ కదలలేదు.

మధురూపు కనుమరుగయ్యేవరకు ఆనంద్ కంపార్టుమెంట్లోంచి చేయిఊపుతూనే వున్నాడు.

కొన్ని నిమిషాలు అలానేనించొని చివరి తన సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు.

ఆ నిశీధిలో ట్రయిన్ భారంగా నడిచిపోతోంది.

ఆనంద్ కిటికీలోంచి శూన్యంలోకి చూశాడు.

ఆ చీకట్లో —

అతని కళ్ళముందు ఎన్నో ఆకారాలు కదలాడాయి!

ఓవర్ బ్రిడ్జి మీదున్న అభాగ్యులు—

రోడ్డుమీద పోతున్న కుష్టురోగులు —

గుడిమెట్లనాశ్రయించిన బిచ్చగాళ్ళు —

ఎంగిలాకుల కాశపడే నిర్భాగ్యులు —

ఏ నాటికైనా వారికూడా మంచిరోజులొస్తాయా?

వాళ్ళ జీవితాలకు వెలుగు లభిస్తుందా?

వాళ్ళ సమస్యలు పరిష్కరింపబడ్తాయా?

అసలు వాళ్ళ దుస్థితికి కారకులెవ్వరు?

—ఎన్నో ప్రశ్నలు అతని హృదయంలో ఉదయించాయి

మానవుడు నైతికంగా దిగజారిపోతున్నాడు!

పాపభీతిని ఏనాడో విడిచిపెట్టాడు!

స్వార్థం, పదవీ వ్యామోహాలకు బందీ అయిపోతున్నాడు!

స్వప్రయోజనాలకోసం ప్రతి రంగంలో రాజకీయపు రంగును పూస్తున్నాడు!

అర్థంలేని ఉద్యమాలను తలపెట్టి అశాంతిని కల్పిస్తున్నాడు!

అంతేకాని —

తోటి మానవుల దుస్థితిని పరిశీలించలేక పోతున్నాడు!

ప్రజల సమస్యను పరిష్కరించటానికి తగిన కృషిని చేయలేక పోతున్నాడు.

చంద్రమండలంమ్మీద అడుగు పెట్టిన ఖ్యాతిని సంపాదించుకున్న యీ మానవుడు —

వైజ్ఞానిక రంగంలో రోజు రోజుకూ ఉన్నత శిఖరాలను అధిరోహించటానికి ప్రయత్నిస్తున్న యీ మానవుడు —

పేదరికాన్ని అరికట్టలేడా?

ఆకలి బాధలను తగ్గించలేడా?

దేశ సౌభాగ్యానికి తోడ్పడలేడా?

సమసమాజ నిర్మాణానికి పూనుకోలేడా?

తన దేశాన్ని అభ్యుదయ పథాన నడిపించి సస్యశ్యామలం చేసే బాధ్యత తనక్కూడా వుందని ప్రతి మానవుడూ గుర్తించిననాడు —

ఈర్ష్యాద్వేషాలకు, కుట్రలు, కుయుక్తులకు స్వార్థానికి అతీతంగా ప్రతివ్యక్తి నిల్చిననాడు —

మన దేశం పాడి పంటలతో, సకల సిరిసంపదలతో, సుఖశాంతులతో విరాజిల్లక పోతుందా?

మానవాళికి మంచిరోజులురాకపోతాయా...."

—ఆలోచిస్తున్న ఆనంద్‌ను "నీ ప్రశ్నలకు తగిన సమాధానాలు నేను చెప్తాను! రా!" అంటూ ఆశపెట్టి, నిద్రాదేవత అతన్ని తన ఒడిలోకి లాక్కొంది.

★

